

# తోడు

అరుణ నిష్ఠల

నేను మేడమెట్లు ఎక్కుతూండగానే సారధి గదిలోంచి పాట నెమ్మదిగా విన్పించసాగింది "డోంట్‌సరెండర్ డోంట్ గివ్ అప్ యువర్ ఫైట్. యుగివ్ ఎ లిటిల్ బిట్ మోర్ ఇఫ్ యు వాంట్ టు విన్'' క్లిఫ్ గొంతుక ఎంత మధురంగా ఉందో అంతే పవర్‌ఫుల్‌గా నిద్రపోయే మనస్సులని తట్టి లేపుతున్నట్లుంది. సారధికి ఈ పాట అంటే ఎంత ఇష్టమో. పాట వినడంలో లీనమై ఉన్నాడేమో నేను వచ్చిన అలికిడి గమనించలేదు.

"సారధి గుడ్ న్యూస్‌రా! ఎట్టకేలకు నీ విశ్వం కాస్టింగ్ పాసవగలిగాడు "అంటూ తెచ్చిన మిఠాయి పాకెట్ లోంచి ఉండ చిన్నది చిదిపి సారధి నోట్లోపెట్టాను. 'కంగ్రాట్స్' చెప్పనీయకపోయ్యిన సారధి మొహంలోకి వెలుగు ఒక్కసారి దూసుకు వచ్చింది. హడావిడిగా మింగుతూంటే పొల బారింది.

వెంటనే మంచినీళ్ళు ఇచ్చాను. "నెమ్మదిగా తిను. ఎందుకంత తొందర'' "కంగ్రాచ్యులేషన్స్‌రా విశ్వం. ఇకపక్క ఉద్యోగం ప్రైయివేటుగా పి.జి. ఇటు కాస్టింగు తెలివైనవాడివిరా ఎంత తెలివి ఉన్నా నిన్ను ఉపయోగించుకోలేక పోతోంది దేశం అని బాధగా ఉందిరా'' అన్నాడు సారధి నా చేయి పట్టుకుంటూ 'ఆటేప్ ఆఫ్ చెయ్యి' అని ఆదేశించాడు.

"డిస్టర్బ్ చేసానా ఇదిగో నువ్వడిగిన ఆర్టికల్,'' "స్విఫ్ట్ టర్టర్ ఎన్డ్ ఇట్స్ ఎఫెక్ట్ ఆన్ ది ఎర్త్'' సారధి చేతికిస్తూ అన్నాను.

"డిస్టర్బెన్స్ ఏంలేదులే మ్యూజిక్ హెవన్ అంటారుగా పాటలేనిదే నాకు తోచదు.'' ఆర్టికల్ అప్పటి కపుడే చదివేస్తూ'

వెరీగుడ్ నాకు తెలుసురా నువ్వు అసాధ్యుడివి. ఎలా సంపాదించావ్'' అన్నాడు సారధి.

"అసలు నీకేం లేకూడదనే నీతో అసలు మాట్లాడకూడదని ఒట్టు వేసుకుంటాను అయిన బుద్ధిగడ్డితిని నిన్ను చూడకుండా ఉండలేకపోవడమూ నీతో మాట్లాడకుండా గడపలేక పోవడమూ నా బలహీనతలై పోయాయి'' నేను నిష్ఠూరంగా అన్నాను. "ఒ.కే. రిలాక్స్ రిలాక్స్ మైబాయ్. నిన్న జరిగిన సంభాషణకేనా ఈ మగులు పోట్లాట'.

"నీకెన్ని ఏళ్ళు ముఫైదాటుతున్నాయి అవునా''

"విశ్వం ప్లీజ్! పెళ్ళి మాట తప్ప ఏదైనా మాట్లాడు'' సారధి గొంతుకలో ఆర్ద్రత.

"అలాగార్డెన్‌లోకి వెడదామా" ఈ మధ్య వారంరోజుల క్రితం జ్వరంతో బాధపడి మొన్ననే తేరుకున్నాడు సారధి కొంచెం నీరసం కనిపిస్తోంది. తేరుకున్నట్లున్నా.

'ఒద్దు. ఇక్కడే బాగుంది'

"ఇక్కడే ఇలా చీకటిలో మగ్గిపో. ఏమన్నా అనాన్ననంటే'' కోపం వస్తోంది నాకు. సారధిని చూస్తూంటే

"నా బ్రతుకే చీకటి అయిపోయింది కదా! వేరే చీకటి ఏమిటి?'' సారధి గొంతుకలో ప్రతిఫలిస్తున్న వేదనకి క్షణకాలం మ్రాన్పడిపోయాను.

"అయాం సారీ సారధి! నేనేం అంటున్నానో నాకే తెలియటం లేదు. నిన్ను మామూలు లోకంలోకి తీసుకుదావాలనీ అందరిలా మసులుతూంటే చూడాలని నా కోరికరా. ఇలా బెంగపెట్టేసుకుని ఒక గదికే పరిమితమైతే నువ్వు ఎలా బ్రతుకుతావురా? డబ్బుకు లోటులేదుగానీ నీకు ఎమోషనల్ సపోర్ట్ లేదురా'' ఆవేదనగా అన్నాను.

"నువ్వున్నావుగా'' శుష్కహాసం చేస్తూ అన్నాడు సారధి

"అదిగో మళ్ళీ అదే మాట నేను ఎల్లకాలం ఉండగలనా నీదగ్గర? అదే నా ధ్యేయం అయినా నాతల తాకట్టు పెట్టేసుకున్నాను కద! నాకు మంచి ఉద్యోగం దొరికితే వెళ్ళద్దా? నామీద బ్రతికే వాళ్ళు అయిదుగునున్నారు".

"నా ఆస్తిలో సగం నీది" సారధి ఇంకా అనబోయాడు నవ్వుతూ.

"ఇంక వాగావంటె నీతో మాట్లాడను" సారధిని చూస్తుంటే ఆవేదన కలిసిన కోపంతో అన్నాను.

"ఒరే విశ్వం! నువ్వు నా మీద అలిగి రాకపోతే" అంతలోనే కళ్ళలో నీళ్ళు వచ్చేసాయి సారధికి.

'ఓ గాడ్ నన్ను రక్షించేవాళ్ళెవరు' వినుక్కుంటూ సాధ్యమైనంతగా గొంతుకను అదుపులో పెట్టుకుంటూ "సారధి! ప్లీజ్! గతం నాస్తి! మరచిపో! నువ్వు ఆపాత జ్ఞాపకాలతో అలా సమాధి అయిపోతే ఇటు ఒంటికి అటు మనస్సుకి కూడా మంచిది కాదు" సారధి తల నిమురుతూ అన్నాను

ఇద్దరి మనస్సులు గతాన్ని మరచిపోమని కోరుకున్నా అపుడపుడు ఆ గతం పలుకరిస్తుంది నన్ను. ఎప్పుడూ గతంలోనే బ్రతుకుతాడు సారధి.

అయిదేళ్ళక్రితం ఫిజిక్స్ ఎమ్మెస్సీ పాసయి కాలేజీలో అందాకా పార్ట్‌టైం లెక్చరర్‌గ పనిచేసేవాడు. దానికి అనుబంధంగా ఉండే స్కూలులో నేను ఇన్‌స్ట్రక్టర్‌గ పనిచేసేవాడిని. అపుడే పరిచయం అయింది అనురాధ. అనూరాధని అప్పుడప్పుడు సారధితో నేను చూసాను. చాలా అందమైన పిల్ల, మంచి గంధంచెక్కలాంటి వర్చస్సుతో నల్లని కళ్ళలో నక్షత్రాలు మెరుస్తున్నాయి, అంత మెరుపుతో చక్కని సౌష్టవంతో పూర్వం కవులు వర్ణించే కధానాయికలా ఉండేది. 'సర్ సర్' అంటూ ఎంతో అమాయకంగా కనిపించేది. తన ఫిజిక్స్ తన అష్టనమి, తన పుస్తకాలు అంటూ వేరేప్రపంచంలో నివసించే సారధి మాటలలో అనూరాధ ప్రస్తావన వచ్చేది తరచూ. ఒకటో క్లాసునుంచి నేను సారధి ఫ్రెండ్స్‌మి. నేను బి.కాం., సారధి బి.యస్సీ., ఒకే కాలేజిలో చేసాము. ఎంతోమంది ఆడపిల్లలు మాతో చదువుకునేవారు. స్ఫురద్రూపి, చెయ్యెత్తు పొడవు రోజువారీ ఎక్సర్‌సైజు చేసే

అలవాటున్న శరీరం అందమైన ముఖం కల సారధి అంటే ఆడపిల్లలకి ఆకర్షణ అనే నా అనుమానం, పైపై మాటలు తప్ప ఎవరితో అంత చనువు పెంచుకోలేదు సారధి. అలాంటిది అనూరాధ వైపు మొగ్గు చూపడం చూస్తే వారిద్దరి జీవితం ముడిపడేందుకు డబ్బు, కులం, చదువు, అందం ఇవేమి అడ్డురాలేదు. ఇద్దరి పెళ్ళి శుభ ఘడియ అనూరాధ గ్రాడ్యుయేటు అయితే దగ్గర పడుతుందేమో అనుకునేవాడిని. మాటలలో అనూరాధని పెళ్ళి గురించి అడగనే అడిగాడు సారధి. అపుడే చెప్పింది అనూరాధ. తెరలు తెరలుగా వచ్చే నవ్వాపుకుంటూ ఎవరినీ పలుకరించకుండా బెట్టుగ ఉండే సారధిని నా కాళ్ళబేరానికి రప్పించకపోతే చూడు అని స్నేహితురాళ్ళతో పందెం వేసి రవ్వల ఉంగరం గెలుచుకుందని, తన సంబంధం పుట్టినపుడే ఫారెన్‌లో చదువుకుంటున్న తన బావతో నిశ్చయం అయిందని చెప్పింది, అసాధ్యురాలు అయిన అనూరాధ అందమైన మొహం వెనకాతల వికృతమైన రాకాసి మనస్తత్వం ఉందని అపుడే తెలిసింది. ఆ మాటలు వింటూనే అవాక్కైపోయిన సారధి నన్ను పట్టుకుని ఏడ్చేసాడు ఆసాంతం. మనిషి మనస్సుతో ఆటలాడుకునే మనుషులుంటారా? ఇలా మనిషిని నిలువునా మోసపుచ్చగలరా? అంటూ సారధి కుమిలి పోతూ మరి మనుషులలో పడనేలేదు. పరధ్యానంగా ఉండిపోయే వాడు. సరిగ్గా అదే నెలలో విపత్తులన్ని ఒకేసారి మీదపడితున్నట్లు ఏక్సిడెంటు జరగడం దరిదాపు ఆరునెలలు ఆస్పత్రిలో మెదడుకు దెబ్బలు తగిలి....

"ఏం విశ్వం బాగున్నావా నాయనా" అతి ఆప్యాయంగా పలుకరించే తాతగారి గొంతుక వింటూనే వెనక్కి తిరిగాను. నౌకరుకుర్రాడితో కాఫీలు పట్టించుకు వచ్చారు. సారధి తాతగారు చిన్నపుడే తల్లిదండ్రిని పోగొట్టుకున్న సారధిని పెంచి పెద్దచేసారు. ఆయనకి సారధి అంటేనేకాదు నేను అన్నా అంతే అభిమానం. వంగి ఆయనకి నమస్కరిస్తూ పరీక్షపాసయిన విషయం చెప్పాను.

తాతగారు చాలా సంతోషించినట్లు



ఆయన చిరునవ్వు చెప్పింది.'గుడ్' అన్నారుసారధివంక చూసి నిట్టూర్చి "విశ్వం! మా సారధిని చూసుకోవలసినవాడివి నువ్వేనయ్యా! విధితో దెబ్బలాడి దెబ్బలు తిని బాగా అలిసిపోయాను" ఆయనఎప్పుడూ అలాగే అంటాడు. నామీద ఆయనకి నమ్మకం.

"మీరేం బాధపడకండి తాతగారు! సారధికి నేను చెబుతాను" అన్నాను ఆయన నా చేయి ఆసరా అన్నట్టు పట్టుకున్నారు. ఆ తరువాత నెమ్మదిగా వెళ్ళిపోయారు. కాఫీ కప్పు సారధికి ఇచ్చి నేనొకటి తీసుకున్నాను. చాలాసేపు మాటలు

ఈ మాటు వచ్చేటపుడు 'షూమేకర్ లెవీ 9' మీద ఆర్టికల్ తేరా విశ్వం"


"అలాగే, నేను మళ్ళా వచ్చేటప్పటికి నైరాశ్యం వైరాగ్యం వదిలేసి మామూలుగా ఉంటేనే" ఎప్పటిలాగే బెదిరిస్తూ బయటకి వచ్చాను. గార్డెన్‌లో తాతగారికి ఒకసారి కనిపించి ఇంటికి వచ్చేసాను.


ఇంటికి వచ్చేసరికి దూరపు చుట్టానికి పినతల్లి వరుసయిన లక్ష్మిపిన్ని, వాళ్ళమ్మాయి శాంతి వచ్చారు అమ్మను చూసేందుకు. చకచక ఇంట్లోతిరుగుతూ నా భార్యకు సాయం చేసే శాంతిని చూస్తుంటే అప్పుడే ఆ ఆలోచన మెదిలింది.

నిజాయితీపరుడు, వ్యసనాలు లేవు.

శాంతి ముందు ఆశ్చర్యంగా కళ్ళు వెడల్పు చేసుకుని చూసి వెనక్కి వెళ్ళిపోయింది. నిటూర్చాను నేను. సారధి ఒప్పుకున్నా పెళ్ళి కూతురుని వెతకడం నాకు కష్టమేమో అని ఆ క్షణంలో అనిపించింది. అరగంట పోయాక పిన్ని శాంతి వెళ్ళిపోయారు. వెళ్ళిపోబోయే ముందు శాంతి తన అభిప్రాయం తెలుపుతుందేమోనని అనుకున్నాను. నా కళ్ళవైపే చూపు కలపకుండా జాగ్రత్తపడి వెళ్ళిపోయింది.

రెండురోజులు పాటు స్కూలుకి రాలేదు, మూడోరోజున నవ్వుతూ వచ్చింది




మాట్లాడలేకపోయాను తాతగారిని తలుచుకుని, అక్కడే ఉన్నబొమ్మలు చూస్తు ఆ పక్కనే ఉన్న ట్రైపాడ్‌మీద నున్న టెలిస్కోపు లెన్స్‌ని నా రుమాలుతో తుడిచాను. అది సారధికి ఎంత ప్రాణమో, తన మూడో నేత్రం అని చెప్పుకునో ఆ టెలిస్కోపులోంచి నాప్రాణం వీకి ఇవిగ్రహాలు ఇది జూపిటర్ అది మార్స్ అంటూ చూపించేవాడు. ఆస్ట్రనమీ అంటే ఎంత ప్రాణమో! నన్ను ఆ ఆర్టికల్ తే ఈఆర్టికల్ తీసుకురా అని ఆజ్ఞాపిస్తాడు. అదేమిటో గాని సారధిని ఎంత ప్రేమిస్తున్నానో సారధి చెప్పేది ఏదీ తిరస్కరించలేను. మొండిగా నామాట విననిసారధిని చూస్తే అంతే కోపం వస్తోంది

"విశ్వం! అమ్మకి తగ్గిందిరా పడిపోయిందన్నావు కాలుజారి"

"బాగానే ఉందిఇప్పుడు, నేను వెళ్ళిరానా?" వెళ్ళడానికి ఉద్యుక్తుడనవుతూ అన్నాను.

ఒళ్ళో పిల్లాడిని పెట్టుకుని ఊరంతా వెదికినట్లు.. అసలు సారధి పెళ్ళి విషయం ఎత్తనిస్తే కదా! అన్యాయానికి, మోసానికి సపోర్ట్ ఇస్తున్నట్లు ఇంకా ఆ అనూరాధని తలుచుకుని బాధపడటం ఏమిటి అంటే నవ్వేస్తాడు, మాట్లాడనీయడు. శాంతిని అడగాలి ముందస్తుగా ఆ తరువాత విషయం చూసుకోవచ్చు.

'శాంతి' వంటింట్లోకి వెళ్ళిపోతూ నాతో చూపు కలిపిన శాంతిని రమ్మన్నట్లు చేయి ఊపాను. ఆరోగ్యంగా విశాలమైన కళ్ళతో కనుముక్కు తీరుగా చామన ఛాయగా ఉండే శాంతికి ఉత్సాహం ఎక్కువ. చకచక పని చేస్తుంది. నేను పని చేసే స్కూలులోనే పని ఆమెకి.

శాంతి రాగానే అడిగాను "నీకు మా సారధి పరిచయమేనా?" అని,

"తెలుసును", అన్నట్లు తలఊపింది.

మీరిద్దరూ కలిసి జీవితం పంచుకుంటే ఎలా ఉంటుంది, సారధి చాలా సాత్వికుడు,పసిపిల్లాడి మనస్తత్వం,

శాంతి పలకరింపుగా చూస్తూ.

"సారధిని చేసుకోవడము నా కిష్టమే' 'ఒక భారం గుండె మీద నుండి దిగినట్లయింది'' సారధిని కూడ కలుసుకుని అడుగుతాను" అన్నాను.

× × × × × × × × × × × ×

"శాంతి అని నా పినతల్లి కూతురుంది. తను నిన్ను చూసింది. నీ గురించి ఇదివరకు తెలుసును. నేను చెప్పాను నాలుగు రోజుల క్రితం, నిన్ను పెళ్ళి చసుకోవడం ఇష్టమే అనితన అభిప్రాయం తెలియజేసింది" ఏమాత్రం ఉపోద్ఘాతం లేకుండా అసలు సంగతి చెప్పేసాను. లేకపోతే సారధి నన్ను పెళ్ళి సంగతి మాట్లాడనీయడు.

"నాకు ఆస్తి ఉంది ఆ సంగతి ఆఅమ్మాయికి తెలుసును అనుకుంటాను' ' వ్యంగ్యంగా అన్నాడు సారధి.

"నాకు ఒళ్ళు మండిపోయింది ఆసమాధానం విని నీకు డబ్బు చూసే

పిల్ల వస్తుందని ఆలోచన తప్ప మరోమాట తెలిసినట్లు లేదే! నీపాటి డబ్బు ఆ పిల్లకీ ఉంది నీ మీద సానుభూతి కురిపించి ఉవకారం చేస్తోంది అని మాత్రం అనుకోకు" విసురుగా అన్నాను. ఈ అవకాశం సారధి చేజేతులా పాడు చేసుకుంటాడేమోనని భయం లోపల పీకుతోంది. నేను గట్టిగా మాట్లాడితే సారధి భరించలేడు. దెబ్బతిన్న పసిపాపలా సోఫాలో ముడుచుకుని తల వంచేసుకున్న సారధిని చూస్తే జాలివేసింది. సారధి మనసు నొప్పించడం ఏ మాత్రం ఇష్టం లేదు నాకు. వెంటనే మామూలుగా అయిపోతూ

"పూర్తిగా చెప్పనియ్యి సారధి! శాంతి అసలు ముందుగా పెళ్ళి చేసుకోదలుచుకోలేదు, ఇది నేను ప్రపోజ్ చేసాకనే ఆమే ఆలోచించి ఒప్పుకుంది. శాంతి అవిటిపిల్ల, మూగ చెవుడును, మనిషికి ఎంత అందమైన హృదయం ఇచ్చాడో దేవుడు. అది ఆమెతో గడిపిన వాళ్ళకి, గాని అర్థం కాదు. తనకి వికలత్వం ఉందని బాధపడదు. అసలు ప్రతీ మనిషికీ హృదయం లేకపోవడం అంటే వికలత్వం ఉందిరా సారధి! అసలు ఈ సంఘమే ఒక పెద్ద వికలాంగురాలు. ఆడపిల్ల పెళ్ళి ఒక గండం అనుకునే హీనదశలో ఉన్నాం మనం ఇంకా.

ఏదో ఒక లోటు తెస్తారు. వాళ్ళ అర్హత ఏమిటి, వాళ్ళేమిటి అని ఆలోచించరు, అసలు హృదయం లేకపోవడం అనే వికలత్వం తమకి ఉందని గ్రహించరు.అంతా మెటిరియలిస్టిక్‌గా తమకు నచ్చినట్లు జరిగి పోవాలని ఆశిస్తారు. అందుకు శాంతి డబ్బుకోసం ఆమె మూగ, చెవుడు కూడా మర్చిపోయి ఆమెను పెళ్ళాడాలని చాలా మంది యువకులు వచ్చారు. అసలు నాకు పెళ్ళివద్దు. డబ్బు అనే పునాది మీద లేచే వివాహం అనే ఇల్లు అసలు నిలువదు అన్నయ్య 'నాకు పెళ్ళి చేసుకోవాలనే లేదు' 'అని ఇదివరలో ఆమె నాతో అంది. అసలు ఇన్నాళ్ళు నేను ఆలోచించలేదా అని ఇవ్వుడు అనిపిస్తోంది. మీరిద్దరు ఒకరికొకరు తోడు ఉంటారు. ఒకరి నీడ మరొకరికి. మీరిద్దరు ఒకే నావలో ప్రయాణించే ప్రయాణీకులు. మిమ్మల్ని సాదరంగా మాలోకి ఆహ్వానించే విశాల హృదయం మాకు లేదురా. అందుకే మీరిద్దరూ కాలాన్ని ఏదో విధంగా గడిపెయ్యకుండా ఒకరికోసం ఒకరు అనే అద్భుతమైన భావన మీ ఇద్దరి జీవితంలో ఉదయించాలని అనిపించిందిరా!

నువ్వు ఆమె గురించి ఎక్కువ తెలుసుకోనక్కర లేదు. వెన్నెల పరిచయం అరుణ కిరణాల వెచ్చదనం నీకు తెలిసినదే కదా! ఆమెలో ఆ లక్షణాలున్నాయి. అందరికీ చల్లదనాన్ని పంచేశక్తి ఆమె స్నేహంలో ఉంది. ఆ స్నేహం నువ్వు పొందాలనీ నువ్వు ఏ విధంగాను డిప్రైవ్ అవకూడదని నా ఆశరా!




ఆమె డబ్బుకోసం ఆశపడుతోందని అనుకోకు, పిన్ని వాళ్ళకి గ్రామంలో ఆస్తిపాస్తులున్నాయి శాంతి ఒక్కతే ఆడపిల్ల వారికి, ఆగాను సారధివంక చూస్తూ.

సారధి చాలాసేపు మాట్లాడలేదు.

"ఏం సారధి"

"ఆ టేప్ రికార్డర్ ఆన్‌చెయ్యి'.

నా మాటలకి సమాధానం ఇవ్వకుండా ఇంకో టాపిక్‌కి మళ్ళిస్తున్నాడంటే సమాధానం చెప్పాలని సారధికి లేదని నాకు తెలిసిపోయింది. వస్తున్న కోపాన్ని బలవంతాన అణచుకుని

"ఒ.కే యాజ్ యులైక్. నేను వారంరోజులదాకా రాలేను"అనిచెప్తూ టేప్ రికార్డర్ ఆన్‌చేసి గబగబ బయటకి వచ్చాను.


లోపల్నించి క్లిఫ్ గొంతుక హెచ్చరిస్తున్నట్లు వినిపిస్తోంది. 'షి ఈజ్ ఎ హార్ట్ యూజర్, నో టైమ్ ఫర్ లూజర్, షి వుడ్ యూజ్ యూ ఎండ్ థ్రో యువర్ లవ్ ఎవే' అదే క్షణంలో అనూరాధ మెదిలింది నా మనస్సులో.

ఆ క్షణంలో క్లిఫ్ ఎంత కరక్టుగా చెప్పాడు అనిపించింది. తన పందెం తన అహం తోటి స్నేహితురాళ్ళలో గెలిచేందుకు ఎంత నాటకం ఆడగలిగింది? సారధి అమాయకుడు గనుకే ఆమె ఆట చెల్లింది. మరే ఘటికుడైనా అయితేనో అనిపించింది. అసామాన్యురాలు కనిపెట్టకపోదు! తనకున్న డబ్బుతో తనని తాను రక్షించుకోవడం కాక అవుటికుడి నామరూపాలు లేకుండా చేయగలదు!

"అప్పుడే వెళ్ళిపోతున్నావేం" తాతగారు క్రింద హాల్లో కూర్చుని ప్రశ్నించారు. నాకు అనూరాధ మీద వచ్చిన కోపం సారధి మీదకి మళ్ళింది ఆ క్షణంలో. సారధి మీద ఏదో చెప్దామని నోటిదాకా వచ్చినా అది తాతగారి మనస్సును కల్లోల పరుస్తుంది. అందుకే 'పనుంది తాతగారు' అంటూ వచ్చేసాను

పండుగలకు రమ్మని మామగారి ఆహ్వానం. ఎప్పుడూ తిరస్కరిస్తున్నా ఈసారి 'ఏమైనా సరే రావాలి చిన్నల్లుడు కూడా వస్తున్నాడు సరదాగా అందరం కలిసి ఎన్నాళ్ళయిందో'అంటూ ఆప్యాయంగా పిలుస్తుంటే కాదనలేక వెళ్ళి వచ్చేసరికి వారం పట్టింది. సారధి ఈలోగా ఆలోచించుకోవడానికి టైముంటుందని ఇంకో ఆశ. వెళ్ళి ఆమాట ఈమాట మాట్లాడి ఏం నిర్ణయించుకున్నావురా' అని అడిగాను.

"నాతో జీవితం పంచుకునేవాళ్ళకి నేను దుఃఖం తప్ప ఏం పంచగలను. నన్ను నాపాటికి వదిలెయ్యలేవా?" హీనస్వరంతో మాట్లాడుతున్న సారధి మీద తేలిగ్గా జయం




సాధించాలంటే నా గొంతుక హెచ్చించి మాట్లాడడమే అధికారంగా. "ఒరే ఎంతసేపు నువ్వు నీ కోణం నుంచి ఆలోచించడం మాను. నువ్వ ప్రేమించ డంలో స్వార్థం ఉంది. అనూరాధ నీకే చెందాలని కోరుకున్నావు. అలాకాక పోయేనరికి తల్లడిల్లిపోతున్నావు. నువ్వు కావాలనుకునే వస్తువు కూడా నిన్ను కావాలను కోవాలిరా, అప్పుడే తృప్తి లభిస్తుంది. లేకపోతే ఆ వస్తువు నీది కాదు. అది సరే! తాతగారి గురించి ఆలోచించావా? ఆయన నీ బాగోగులు ఎన్నాళ్ళు చూడగలరు? నీమీద బెంగతో చిక్కి శల్యమైపోయారే! ఇవన్నీ జరిగాక ఎంతో ఆలోచించే నేను శాంతితో నీ జీవితం మళ్ళీ పూవులు పూయుగలదని భావించాను. నువ్వు చదివిన చదువు నేర్చిన జ్ఞానం అంతా బూడిదలో పోసి ఒక అనామకురాలి గురించి నువ్వంటె ఏమాత్రం లక్ష్యంలేని నిర్దయురాలి గురించి ఆలోచిస్తూ కాలం గడిపేయడం ప్రేమ అనుకుంటున్నావురా? నీ ప్రేమ నీ హృదయంలో అనూరాధ క్షేమాన్ని ఆకాంక్షిస్తూండాలి. ఆమె సుఖంగా ఉందని తనకి నచ్చిన జీవితం గడుపుతోందని నీకు ఆనందం కలుగజేయాలి. నిన్ను చూస్తుంటే అదేం కనపడటంలేదు. ఏదో బ్రతుకు ఈడ్చేయనీ అన్నట్లున్నావు భగ్న ప్రేమికుడిలాగ దేవుడిచ్చిన నీ జీవితం సార్థకం చేసుకో! నీకు వచ్చిన జ్ఞానాన్ని నలుగురి పిల్లలకి పంచిపెట్టు, శాంతితో స్నేహంచెయ్యి.

"మరి కమ్యూనికేషన్" అడగలేక అడిగాడు సారథి.

"తను డెఫ్ అండ్ డంబ్ అయినా స్కూలులో బాగానే చదువుకుంది. ఇపుడు అదే స్కూల్లో నా జాగాలో ఇనస్ట్రక్టర్‌గా ప్రమోషను వచ్చింది. నేను ఢిల్లీలో ప్రయివేటు ఫర్మ్‌లో అకౌంటెంటుగా ఆర్డరు వచ్చి వెడుతున్నాను. శాంతికి బ్రెయిలీ లిపి కూడా వచ్చు. నువ్వు చదివే ఆర్టికల్స్ ఎలా సంపాదిస్తున్నానను కున్నావు? నేను ఆర్టికల్స్‌పుస్తకాలు చూసి జిస్ట్ రాసి ఇస్తే శాంతి బ్రెయిలీలో తర్జుమా చేసి ఇస్తోంది. ముందు శాంతి నీకు పుట్టుకతో కళ్ళు లేవు అని అభిప్రాయపడింది. కాని అయిదేళ్ళక్రితం నీకు కారు ఎక్సిడెంటులో మెదడుకు దెబ్బలు తగిలి చూపు పోయిన విషయం చెప్పాను. ఈ దిక్కుమాలిన సంఘంలో అన్ని అంగాలు శుభ్రంగా ఉన్నా వారి తోడు లభించడం వికలాంగులకి కష్టమే. అలా లభించినా ఏదో ఉపకారం చేస్తున్నామన్నా సుపీరియారిటి కాంప్లెక్స్ వారికుంటుంది. అలాంటి వారి సానుభూతి చచ్చిన మీరు భరించలేరు ఆత్మాభిమానం మీకు చాలా ఎక్కువ. శాంతి విషయంలో నీకు అలాంటి విషయాలకి తావులేదు. ఏమంటావు?" సారధి ఆర్తిగా నా చేయిపట్టుకుంటూ "నువ్వు వెళ్ళిపోతున్నావా? నా సంగతో" అని అడిగాడు. "చెప్పానుగా నా వారసురాలిగా శాంతికి నిన్ను అప్పగించి వెడుతున్నానంటే నా మనశ్శాంతి ఆలోచించు. అంతేకాదు రేపు మీకు పుట్టబోయే బిడ్డ మీలా కాక కళ్ళు నోరు వినికిడి శక్తి కలిగి ఉండడమేకాక మీలా కాకుండా హృదయం కలిగి ఉంటుందని ఆశీర్వదిస్తూ వెడుతున్నాను. తాతగారితో ఈ సంగతి చెబుతున్నాను" అంటూ లేచాను.

సారధి నా చేయి వదల్లేదు. ఏం ఎదురు చెప్పలేదు అంటే శాంతిని తన చీకటి జీవితాన్ని వెలుగు మయం చేయడానికి ఆహ్వానించినట్లే! శాంతి సారధికి తోడుగా వస్తోందంటే తాతగారు కూడ సంతోషిస్తారు.

●